


# స్వావలంబన

సువర్ణ

*ఆకాశంలో మబ్బులు కమ్మడంతో త్వరగా చీకటి పడింది. నవంబర్ మాసం. చలిగాలి వీస్తుంటే భుజాల చుట్టూ చీరకొంగు కప్పుకుని లైబ్రరీ నుంచి హాస్టల్ వేపు నడుస్తున్నాను. చలికాలంలో ఈ క్యాంపస్ చాలా అందంగా వుంటుంది. ఈ నవ్వే పూలని చూస్తుంటే నా బాధకి ఊరడింపు కలుగుతుంది. నుదుటి మీదకి జారుతున్న ముంగురుల్ని సవరించుకుంటూ పక్కకి చూశాను. ఆడుకుంటున్న చిన్నపిల్లలు కనిపించారు. వాళ్ళని చూడగానే ఇంటి దగ్గర నా పిల్లలు గుర్తుకొచ్చారు.*

"నాన్న వానలో ఆడుకోనివ్వడం లేదమ్మా. తడిస్తే జలుబు చేసి జ్వరం వస్తుందట. మమ్మల్ని చూసుకోడానికి ఎవ్వరూ వుండరు అని అంటున్నారు" అని ఫోనులో తన చిన్నకూతురు చేసిన ఫిర్యాదు గుర్తొచ్చి నవ్వొచ్చింది.

పిల్లల్నీ, ఇంటినీ వదిలొచ్చి ఆరు నెలలు కావొస్తోంది. ఇంత పేరున్న యూనివర్సిటీలో రీసెర్చ్ చేస్తానని కలలో కూడా ఊహించలేదు. ఎం.ఏ చదవటమే చాలా కష్టమైపోయింది. అప్పటికే పెళ్ళీ, పిల్లలూ, సంసార బాధ్యతలూ మీద పడటంతో మంచి మార్కులు తెచ్చుకోడానికి చాలా కష్టపడ్డాను. అందుకనే పై చదువుల గురించి అప్పట్లో ఆలోచించకుండా ఉద్యోగ ప్రయత్నం చేశాను. నా పిల్లలు చదువుతున్న స్కూల్లోనే ఇంగ్లీషుటీచర్ ఉద్యోగం వచ్చింది.

వృత్తిపరంగా సంతృప్తిగానే వుండేది. అయితే, మనం పాఠ్యపుస్తకాల ద్వారా పిల్లలకి ఏం నేర్పిస్తున్నామూ అనే ప్రశ్న మాత్రం నిరంతరం నన్ను వెంటాడేది.

చాణక్యుడి గురించి చెప్పకుండా అరిస్టాటిల్ గురించి వాళ్ళకి ఎందుకు చెప్తున్నాం?

కథలకి కాణాచి అయిన మన దేశంలో పుట్టిన కథలను కాకుండా ఇంగ్లాండులోనో, అమెరికాలోనో పుట్టిన కథల్ని ఎందుకు చెప్తున్నాం?

మన పక్క వాడు చొక్కా లేకుండా చలిలో గజగజా వొణుకుతున్నాడనే నిజాన్ని చెప్పకుండా అమెరికా వాళ్ళు స్వెట్టర్లు వేసుకుంటారని గొప్పగా చెప్పి ఎందుకు సంతృప్తిపడుతున్నాం? ఈ ప్రశ్నలన్నీ నన్ను వేధించేవి.


ఏడోక్లాసు ఇంగ్లీషు పాఠ్య పుస్తకంలో వున్న పాఠమే ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకంలోనూ వుంది. ఆ పాఠాన్ని పిల్లలకి చెప్పి స్టాఫ్‌రూమ్‌కి వస్తుంటే సరళ కనిపించింది.

"ఏంటో ఇలా అర్థంపర్థం లేకుండా ఏదోఒకటి పాఠంగా పెట్టేసి పిల్లలకి ఇంగ్లీషు రావటంలేదు. సరిగ్గా నేర్పించండి అంటే ఏంచెయ్యాలీ? పిల్లలు ఆసక్తిగా వినే పాఠం పుస్తకం మొత్తం వెతికితే ఒక్కటి కూడా కనిపించడం లేదు. ఇలాంటి పాఠాలు సిలబస్‌లో పెట్టే గవర్నమెంటు వాళ్ళకి తలకాయ వుండదో ఏమిటో..." అన్నాను కొంచెం విసుగ్గా.

సరళ కూడా మా డిపార్ట్‌మెంటే. నాకంటే కొంచెం సీనియర్ కావటంతో నాకే సమస్య వచ్చినా ఆమెకే చెప్తుంటాను. ఎప్పుడూ నవ్వుతూ వుండే ఆమె అంటే పిల్లలందరికీ చాలా ఇష్టం. అసలు ఆమెకి ఎప్పుడేనా కోపం వస్తుందా అనే సందేహం కలుగుతుంది నాకు.

నా విసుగంతా వెళ్ళబోసుకున్న తర్వాత "ఇప్పుడేమైంది సువర్ణా" అని అనునయంగా అడిగింది.

"ఇవాళ ఎనిమిదో తరగతి పిల్లలు అసలు పాఠం వినలేదు. నా మీద గౌరవంతో క్లాసులో కూర్చున్నారు తప్ప పాఠం అంటే ఆసక్తే లేదు. వాళ్ళ మొహాల్లో విసుగు కొట్టొచ్చినట్టు కనిపించింది. ఏమైందీ అని అడిగాను. సెవెన్త్ క్లాసులో చదువుకున్నదే కద మేడమ్- కొంచెం బోర్ కొడుతోంది అన్నారు. నిన్న ఆరో తరగతి పిల్లలకి ట్రోజన్‌వార్ పాఠం చెప్తొంటే అయోమయంగా చూశారు. సరే అర్థమవుతుంది కదా అని భారతంతో పోల్చి చెప్పబోతే బిక్కమొహం వేశారు. అప్పుడర్థమైంది నాకు, వాళ్ళకి ట్రోజన్ వార్ ఎంత కొత్తో మహాభారతం కూడా అంతేనని. ఇట్లాంటి ఆసక్తిలేని కథలు, ఆ వయసుకి అర్థంకాని కథలు పాఠాలుగా పెట్టుకుని వాళ్ళకి భాష రావాలి నేర్పించండి అంటే మనమేం చెయ్యాలీ?" అన్నాను కొంచెం బాధ, ఆవేశం కలగలిసిన గొంతుతో.



సువర్ణ

"అంతేనా! దానికి గవర్నమెంటుని తిడితే ఎలా? ఆ పుస్తకాలు సిలబస్‌గా రాసిన వాళ్ళని అడిగితే సరి" అంది నవ్వుతూ.

"ఏంటి సరళా! నువ్వు కూడా అంత తేలిగ్గా తీసుకుంటావు. మనవైపు నుంచి కొన్ని పాఠాలు అర్థమయ్యేలా చెప్పటానికి ఎంత ప్రయత్నించినా పిల్లల దగ్గర నుంచి రెస్పాన్స్ రావటం లేదు అని నువ్వు ఎన్నిసార్లు నా దగ్గర అనలేదూ" అన్నాను. ఆ మాట అన్నప్పుడు నా గొంతులో ఉక్రోషం ధ్వనించింది.

"నిజమేనమ్మా! అయితే దానికి మనమేం చెయ్యగలం? ఇంత ఆవేశపడుతున్నావుగా, నువ్వే పరిశోధించి ఈ సమస్యకి పరిష్కారం కనుక్కోవచ్చు కదా" అంది ఆటపట్టిస్తున్నట్టుగా.

అవును నిజమే కదా! ఆమె హాస్యానికే అనుండొచ్చు కాని, ఈ పుస్తకాల నుంచి మనం మన సంస్కృతి గురించి, ఔన్నత్యం గురించి నేర్పించలేకపోగా పరదేశ వ్యామోహాన్ని పెంచుతున్నాం. దానికి నిజంగానే ఏదైనా పరిష్కారం దొరికితే బావుండు అనుకున్నాను.

నేనిలా ఆలోచిస్తున్నప్పుడే నాకొక అవకాశం కూడా కలిసివచ్చింది.

ప్రభుత్వానికి పాఠ్యపుస్తకాల తయారీలో సహాయపడే ఓ యూనివర్సిటీ వాళ్ళు రీసెర్చిలో ఉత్సాహం, అర్హత వున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ ప్రకటన ఇచ్చారు. ప్రవేశ పరీక్షలో పాసయ్యాను. నే పరిశోధన చెయ్యదల్చుకున్న అంశం మీదే నాకు సీటు కూడా ఇచ్చారు. పరిశోధన ద్వారా ఏదో సాధించాలన్న పట్టుదలతో మొదటిసారి ఇంటినీ, పిల్లల్నీ వదిలి ఈ యూనివర్సిటీలో అడుగు పెట్టాను.

ఇక్కడికొచ్చాక కూడా, పిల్లలకి పాఠ్యాంశాలలో తీసుకు రావల్సిన మార్పుల గురించి కొత్తకొత్త ఆలోచనలు నాలో చుట్టుముడుతూనే వుండేవి. వాళ్ళకోసం ఏమైనా చెయ్యాలన్న ఆశయమూ రానురాను మరింత బలపడింది.

ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరున్న యూనివర్సిటీ. ఇక్కడ చదువుకునే అవకాశం కలిగినందుకు, గొప్పగొప్ప వాళ్ళు గురువులైనందుకు ఎంతో సంతోషం వేసింది. తొలి నాళ్ళలో కలిగిన ఆ ఆనందం నీరుకారిపోడానికి ఎన్నాళ్ళో పట్టలేదు.

అందరూ గొప్పగొప్ప ప్రొఫెసర్లే- చాలా పుస్తకాలు రాసినవాళ్ళే- ఇదంతా దూరంనుంచి చూసేంత వరకే. దగ్గరగా చూసిన తర్వాత వాళ్ళలో వున్న బోలుతనమంతా తెలిసివచ్చింది. వాళ్ళు రాసిన పుస్తకాలంత పెద్ద మనసులు వాళ్ళ దగ్గర లేవని అనిపించింది.

ఒక పాఠ్యపుస్తకం రాసిన తర్వాత అది నిజంగా పిల్లలకి ఎలా ఉపయోగపడుతుందీ అన్నది వాళ్ళకి పట్టదు. ఎవరో ఇంగ్లాండులోనో అమెరికాలోనో అటువంటి పాఠం పిల్లలకి ఉపయోగపడుతుందని రుజువు చేశారు కాబట్టి అదే విధానాన్ని ఇక్కడా పాటించాలంటారు. అది మన పరిస్థితులకి, పిల్లలకి అనువైనవా కాదా అన్న ఆలోచన వీరికి రాదు, రానివ్వరు.

ఇక్కడికొచ్చాకా, నేను ఈ పద్ధతుల మీద గట్టిగానే ఎదురు తిరిగాను.

'పిల్లలు భాషతో పాటు భావం కూడా నేర్చుకుంటారు. ఆ భావం మన పరిసరాలకు చెందిందైతే భాష త్వరగా నేర్చుకోగలుగుతారు' అని నేను గట్టిగానే వాదించాను. నా వాదన వాళ్ళకి నచ్చలేదు. పైగా నా పరిశోధనాంశాన్ని మార్చుకునేందుకు ఒక అవకాశం ఇస్తున్నట్టు రీసెర్చి కమిటీ వారు నోటీసు ఇచ్చారు.

అయితే, నేను నా ప్రయత్నాన్ని విరమించదల్చలేదు. ఆ విషయాన్ని చాలా స్పష్టంగా వాళ్ళకి తెలియజేశాను.

అంతపెద్ద ప్రొఫెసర్లూ నా విమర్శలో వున్న అంతరార్థాన్ని గ్రహించలేదు. నేను విమర్శిస్తున్నది వాళ్ళు తయారుచేసిన పుస్తకాలనే కనుక అస్సలు హర్షించలేకపోయారు. అదే రీతిగా నేను వ్యవహరిస్తే ఇక్కడి నుంచి నేను డిగ్రీ తీసుకుని బయటపడటం అనేది సాధ్యంకాదన్న సంగతి నాకిప్పుడిప్పుడే అర్థమౌతోంది. సమస్యని సాత్వికంగా పరిష్కరించుకుని త్వరగా ఇంటికి వెళ్ళిపోయే

మార్గం కోసం అన్వేషిస్తున్నాను.

ఈ రోజు లైబ్రరీలో నా వాదనకి బలం చేకూర్చే ఒక వ్యాసం దొరికింది. అధ్యయనం చేశాను. దానిని మన పాఠ్యపుస్తకాలకి ఎలా అన్వయించవచ్చో ఆలోచిస్తూ హాస్టల్‌కి చేరుకున్నాను.

ఈ ఆలోచనల మధ్యే రెండు రోజులు గడిచిపోయాయి.

రెండోనాడు "షెడ్యూల్డు కూలాలు, తెగలు- వారి విద్యావకాశాలు" అనే అంశం మీద యూనివర్సిటీ వారు పెద్ద సెమినార్ ఏర్పాటు చేశారు. ఇదే మంచి సందర్భం అనుకుని నేనొక విమర్శనాత్మక వ్యాసం ఒకటి రాసుకుని మా ప్రొఫెసర్ దగ్గరికి తీసుకెళ్ళాను. ప్రస్తుతం వున్న పాఠాలలోని అంశాలు, వాటిని బోధించడం వల్ల కలిగే దుష్పరిణామాలను నా వ్యాసంలో ఉదహరిస్తూ దానికి బలం చేకూర్చే సిద్ధాంతాన్ని కూడా ప్రతిపాదించాను.

'అందమైన సాయంకాలం గురించి నాలుగు వాక్యాలు రాయమని' పిల్లలకోసారి ప్రశ్న ఇస్తే, వాళ్ళు స్ప్రింగు-ఆటమ్ అంటూ మనకు రాని, మనకు లేని కాలాల గురించి రాశారు. నిజంగానే వాళ్ళకి మనం అవే నేర్పిస్తున్నాం. అందుకనే వాళ్ళ చుట్టూ వున్న వాతావరణాన్ని, వాస్తవాన్ని మర్చిపోయే పరిస్థితిలో వున్నారు అని ఒక్కొక్క పాఠాన్ని తీసుకుని చర్చించాను. ఆ పాఠాల్ని చెప్పడం ద్వారా పిల్లలకి ఎలా అసహజ సామాజిక విలువలని నూరిపోస్తున్నామో విశదీకరించాను. వాస్తవానికి అది నా పరిశోధనలోకి వెళ్ళబోయే అతి ముఖ్యమైన భాగం. అది రాయడానికి కూడా చాలా రోజులు కష్టపడ్డాను.

అంతా చదివిన తర్వాత ఆ ప్రొఫెసర్-

"ఇవన్నీ నువ్వనుకుంటున్నంత పెద్ద సమస్యలేం కాదమ్మా. పిల్లలకి కావలసిన విలువలు ఇంట్లో నేర్పిస్తారు. లేదా చుట్టూ చూసి వాళ్ళే నేర్చుకుంటారు. మనం రాస్తున్నది భాష నేర్పిచటానికి మాత్రమే కాబట్టి విలువల గురించి అంతగా పట్టించుకోనవసరం లేదు" అంటూ చెప్పుకొచ్చారు. ఇప్పటిదాకా ఎవరూ తప్పుపట్టని ఆ పుస్తకాల్ని నేను అలా విమర్శించటం తనకు నచ్చలేదని కూడా చెప్పారు.

తిరిగి వచ్చేశాను. అశాంతిగా అనిపించింది. సమస్యను అర్థంచేసుకోడానికి వాళ్ళు ఎందుకు ఇష్టపడడం లేదో అవగతంకావడం లేదు.

సెమినార్ ప్రారంభం కాగానే వెళ్ళి హాలులో కూర్చున్నాను. వేదికమీదున్న ప్రొఫెసర్లు 'వెనుకబడిన కులాల గురించి, షెడ్యూల్డు కులాల గురించి, వాళ్ళని ప్రోత్సహించాల్సిన విధానాల' గురించి సూచనలిస్తూ తెగ ఉపన్యాసాలు ఇచ్చారు.

అదంతా వింటుంటే బాగా నవ్వొచ్చింది. పాఠ్యపుస్తకాల్లో షెడ్యూలు కులాల వాళ్ళ గురించి ఒక పాఠం కూడా రాయడానికి ఇష్టపడని వాళ్ళు అలా ఆవేశంగా మాట్లాడటం హాస్యాస్పదం అనిపించింది.

సెమినార్‌లో పెద్దలు మాట్లాడిందంతా ఎప్పట్లాగే మరుసటి రోజు పేపర్లలో చాలా గొప్పగా పొగుడుతూ వార్తలొచ్చాయి.

ఆ పేపర్లు చూడగానే నా సమస్యకు ఒక పరిష్కారం దొరికినట్లుగా అనిపించింది. ఆఖరిసారిగా మా ప్రొఫెసర్‌ని కలిశాను. ఏమనుకున్నారో ఏమో, ఈసారి తన పంథా మార్చారు. 'సమస్య పాఠ్యపుస్తకాల్లో లేదు. వాటిని క్లాసుల్లో బోధిస్తున్న ఉపాధ్యాయుల్లో వుంది' అన్నారు. ఆ పాఠాల్ని ఎలాగైనా మలిచి చెప్పొచ్చు కదా అని నాకు 'జ్ఞానోదయం' కలిగించే ప్రయత్నం చేశారు.

నెల రోజులు... తిరిగిపోయాయి.

తర్వాత హాస్టల్ రూమ్ ఖాళీచేసి మొత్తం సర్దేసుకుని ఇంటికి వెళ్ళేందుకు రైల్వేస్టేషన్ చేరుకున్నాను. రైలు కదలడానికి ఇంకా పావుగంట టైమ్ వుంది. లోపల ఉక్కగా అనిపిస్తే, కిందకి దిగి నా సీటు దగ్గరున్న విండో దగ్గరే నిల్చుని వచ్చేపోయే వారిని గమనిస్తున్నాను. దూరంగా ఎవరినో వెతుకుతున్నట్టుగా చూస్తున్న ఒక అమ్మాయి నన్ను ఆకర్షించింది. హెయిర్ స్టయిల్ చూసి కేరళ అమ్మాయేమో అనుకున్నాను. నేను తననే చూడటంతో ఏమనుకుందో ఏమో ఆ అమ్మాయి స్నేహపూర్వకంగా నవ్వుతూ నా దగ్గరికి వచ్చింది. ఆమె నడకలోనూ, నవ్వులోనూ ఒక గమ్మత్తయిన ఆకర్షణ. వయసు పాతిక సంవత్సరాలలోపు వుండొచ్చేమో అనిపించింది. మంచి అందం అని చెప్పలేం కాని తనని ఒకసారి చూస్తే ఇట్టే గుర్తుండిపోతుంది.

"ఎక్స్‌క్యూజ్‌మీ! నా పేరు కవిత. కేరళ నుంచి వస్తున్నాను. (నేను వూహించింది కరక్టే!) ఢిల్లీ వెళ్ళాలి. ఇక్కడికి ఒక ఫ్రెండ్ వస్తానంది. ఆమె రాలేదు. ఇక్కడినుంచి రేపు పొద్దున్న వరకూ డైరెక్టు ట్రైన్స్ లేవట. భాష రాదు కాబట్టి ఎలా వెళ్తే బావుంటుందో చెప్తారా" అని గబగబా ఇంగ్లీషులో అడిగింది. నాతోపాటు విజయవాడ వరకూ వచ్చి అక్కడ ఢిల్లీ రైలు ఎక్కమని సలహా ఇచ్చాను.

ఇద్దరం రైల్లో కూర్చున్నాం. రైలు కదులుతుంటే- 'ఏదో సాధించాను అనే కొండంత

**"అక్కడ లంచం పెట్టిన వారి పరిశోధన ఫలిస్తుంది. వెలుగులోకీ వస్తుంది. అలా చెయ్యలేక మాలాంటివాళ్ళు బయటికి వచ్చి సొంతంగా ఏదైనా చేసుకుందామన్నా చేతికి డిగ్రీలు ఇవ్వరు" అని చాలా బాధపడుతూ చెప్పింది**



సంతృప్తితోనూ, డిగ్రీ సాధించలేకపోయాను అనే చిన్న అసంతృప్తితోనూ ఇంటికి వెళ్తున్నాను అనిపించింది.

నా ఆలోచనల్లో నేనుండిపోయి కవిత సంగతే మర్చిపోయాను. నేను ముభావంగా వుండటంచూసి తనే మాట్లాడటం మొదలుపెట్టింది.

"ఏంటి ఆలోచిస్తున్నారు" అని అడిగింది.

"ఏంలేదు" అని చెప్పినప్పుడు నాకు చిన్నగా నవ్వొచ్చింది. తిరిగి నేనే అడిగాను-

"ఢిల్లీలో మీరేం చేస్తుంటారు"

ఢిల్లీ అగ్రికల్చరల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చి చేస్తున్నానని చెప్పింది. రీసెర్చి పేరెత్తగానే నాలో ఉత్సుకత పెరిగింది. ఎందులో చేస్తున్నారు, పరిశోధన ఎంతవరకూ వచ్చిందీ అని అడిగాను.

చానాళ్ళ తర్వాత ఎంతో ఇష్టమైన బొమ్మల్ని మళ్లీ చూసినప్పుడు చిన్నపిల్లల కళ్ళల్లో మెరిసే మెరుపు లాంటిదేదో ఆమెకళ్ళల్లో కనిపించింది. చాలా ఉత్సాహంగా చెప్పటం మొదలుపెట్టింది.

రెండు పంటలు పండే చేలల్లో- పంటకీ పంటకీ మధ్య ఒక నెలరోజుల వ్యవధిలో భూమి బలాన్ని ఎక్కువ లాగకుండా ఎంతో పోషక విలువలున్న కొత్తరకం ధాన్యానికి విత్తనాలను తాను కనిపెట్టిందట! వాటి ఉపయోగాన్ని పొలంలో పండించి కూడా చూపించిందట! కాని తాను కనిపెట్టిన విత్తనాల్ని, పరిశోధన ఫలితాల్ని ఆ ఇనిస్టిట్యూట్ వాళ్ళు బయటకు రానివ్వటం లేదట!

"అక్కడ లంచం పెట్టిన వారి పరిశోధన ఫలిస్తుంది. వెలుగులోకీ వస్తుంది. అలా చెయ్యలేక మాలాంటివాళ్ళు బయటికి వచ్చి సొంతంగా ఏదైనా చేసుకుందామన్నా చేతికి డిగ్రీలు ఇవ్వరు" అని చాలా బాధపడుతూ చెప్పింది.

కొద్దిసేపటికే ఆమె సర్దుకుంది.

"సారీ అండి. మీరు అడగ్గానే నా బాధ వినేవాళ్ళు ఒకళ్ళు దొరికారన్నట్టు గబగబా మాట్లాడేశాను. బోరు కొట్టించానా? నా సమస్య ఇప్పట్లో తీరేదీ కాదు, మీరు నేను చేయగలిగిందీ లేదు. అన్నట్లు మీరేం చేస్తున్నారో చెప్పనే లేదు" అంటూ నా వివరాలు అడిగింది.

క్లుప్తంగా నా రీసెర్చి గురించి, నేను ఎదుర్కొన్న సమస్య గురించి చెప్పాను.

"అయితే ఇద్దరం ఒకే పడవలో ప్రయాణిస్తున్నామన్న మాట..." అన్నది. నా లగేజీని చూసి "కొంపతీసి రీసెర్చి వదిలేసి వచ్చేయటం లేదుకదా! వదిలేయకండి. పోరాడి సాధించాలి తప్ప వాళ్ళని అలా వదిలేయకూడదు. నన్ను చూడండి. మూడేళ్ళ నుంచీ ఎంత కష్టపడుతున్నానో..." అన్నది అనునయంగా.

తన మాటకారితనం చూసి నవ్వాను. తర్వాత చెప్పాను-

"నేను రీసెర్చి వదిలేసిన మాట వాస్తవం. కానీ సమస్యని మాత్రం వదిలేయడం లేదు" అని.

అర్థంకాక ప్రశ్నార్థకంగా చూసింది. గడిచిన నెలరోజుల్లో సాధించిన విజయాన్ని మొదటిసారి ఆమెకి వివరించాను.

'మన పాఠ్యపుస్తకాలు- వాటిలోని అంశాలు' అన్న శీర్షికతో ఒక ప్రముఖ దినపత్రికలో నేను వారంరోజులపాటు వ్యాసాలు రాశాను. నా వ్యాసాలకు మంచి స్పందన వచ్చింది. మా ప్రొఫెసర్లు అంగీకరించని విషయాలను విద్యార్థుల తల్లిదండ్రులు అంగీకరించారు. 'నేను లేవనెత్తిన అంశాలు తమని ఎప్పటినుంచో వేధిస్తున్నాయనీ, పాఠ్యపుస్తకాల ద్వారా బోధించే అంశాలు పిల్లల ఆలోచనల్లో మార్పు తెస్తోందని, అయితే ఆ మార్పు హర్షించదగిందీ, మన సమాజానికి ఉపయోగపడేదీ కాదని' వాళ్ళంతా పెద్దఎత్తున ప్రభుత్వానికీ, యూనివర్సిటీ వారికీ ఉత్తరాలు రాశారు.

'ఇన్నాళ్ళూ మరో మార్గంలేక ఇలాంటి పాఠాలు చెప్పుకొచ్చాం. విద్యార్థుల్లో ఆసక్తి కలిగించలేని, వాళ్ళని చుట్టూవున్న వాతావరణానికి దూరంచేసే ఇలాంటి పాఠాల్ని ఇకపై చెప్పబోమని' రాష్ట్రం నలుమూలలా వున్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులంతా ఏకాభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.

దాంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. వెంటనే ఆ యూనివర్సిటీకి కొత్తగా ఆదేశాలు పంపింది. ఆ ఆదేశాల ప్రకారం వచ్చే విద్యాసంవత్సరం నుంచి పాఠ్యపుస్తకాల్లో అంశాలను మారుస్తున్నట్టు యూనివర్సిటీ ప్రకటన చేసింది. ఆ ప్రకటనని ఇవ్వాళ పొద్దున్నే నోటీసు బోర్డులో స్వయంగా చూశాను.

నేను వచ్చిన పని అయిపోయిందనిపించింది. నేను కేవలం పరిశోధనకే పరిమితమైతే, నాకొక డిగ్రీ మాత్రమే దక్కేది. నా సిద్ధాంతం లైబ్రరీ అరల్లో మిగిలిపోయేది. ఇలాంటి మార్పుకి దోహదపడేది కాదు'.

- నేను చెప్పాల్సిందంతా చెప్పి తన అభిప్రాయం తెలుసుకోవడం కోసం కవిత వంక నిశితంగా చూశాను.

కళ్ళు పెద్దవి చేసుకుని నా వంక విస్మయంగా చూస్తుండిపోయింది. ఈలోగా నే దిగాల్సిన స్టేషన్ వచ్చేసింది.

**తను ఎక్కడ దిగి, ఏ ప్లాట్‌ఫారం మీద ఢిల్లీ రైలు ఎక్కాలో కవితకు వివరించి నేను లగేజి దించుకునే హడావుడిలో పడిపోయాను. నాకు సాయపడటానికి మావారు స్టేషన్‌కి వచ్చారు. కవితని ఆయనకి పరిచయం చేశాను. రైలు కదులుతోంది. నేను బయలుదేరుతుంటే దూరం నుంచి కవిత అభినందనగా అన్న మాటలు లీలగా వినిపించాయి-**

**"హేట్సాఫ్ టుయూ"**

**ఆమెకి వీడ్కోలు చెబ్తుండగానే రైలు వేగం పుంజుకుంది.**